

దొంగల ముఠా అరెస్ట్

మరిపెడ మీదుగా గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు రూ.7.50లక్షల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. - 8లో▸



మార్కెట్ సమస్యలు..

వరంగల్ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయికి చాంబర్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
38.0⁰ /19.0⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మబ్బులు, సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎంజీఎంలో సదరం క్యాంపు

విద్యారణ్యపురి: దివ్యాంగ టీచర్లకు సదరం సర్టిఫికెట్ల కోసం ఈనెల 28న వరంగల్ ఎంజీఎంలో సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండి అబ్దుల్‌హై సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓహెచ్, ఎంఆర్, హై కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులు సదరం సర్టిఫికెట్లు లేకుండా, మెడికల్ బోర్డు సర్టిఫికెట్ ఉన్నవారు తప్పనిసరిగా ఈక్యాంపునకు హాజరై సర్టిఫికెట్లు పొందాలని పేర్కొన్నారు. మార్చి 10 వరకు హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ఆయా సదరం సర్టిఫికెట్లు అందజేయని ఉపాధ్యాయులను ప్రాధాన్యతా కేటగిరీలో పరిగణించబోరని తెలిపారు.

అంతర్జాతీయ మేళాలో కొత్తవాడ దర్రీస్‌కు గుర్తింపు



వరంగల్: హరియాణా సూరజ్‌కుండ్‌లో ఈనెల 3నుంచి 13వ తేదీ వరకు జరిగిన 36వ అంతర్జాతీయ సూరజ్‌కుండ్ క్రాఫ్ట్ మేళాలో కొత్తవాడ దర్రీస్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని జాతీయ చేనేత అవార్డు గ్రహీత పిట్ట రాములు తెలిపారు. ఈ అంతర్జాతీయ మేళాలో 45దేశాలు పాల్గొన్నాయని, ఆయా దేశాలతోపాటు వివిధ రాష్ట్రాలనుంచి వచ్చి చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో కొత్తవాడ దర్రీస్ ప్రదర్శించిన తనకు కళామణి అవార్డు పురస్కారం దక్కిందన్నారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, హరియాణా టూరిజం(మేళా నిర్వాహకులు) అధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు చెప్పారు. అవార్డు పొందిన రాములును కొత్తవాడ చేనేత సంఘాల నాయకులు అభినందించారు.

న్యూట్రిషన్ కిట్లు అందించడం సంతోషకరం

ఎంజీఎం: పౌష్టికాహార లోపం కారణంగా క్షయ వ్యాధి ఆలస్యంగా తగ్గే అవకాశం ఉన్నందున క్షయ వ్యాధిగ్రస్తులకు రెడ్ క్రాస్ ముందుకు వచ్చి న్యూట్రిషన్ కిట్లు అందించడం సంతోషకరమని టీబీ జాయింట్ డైరెక్టర్ రాజేశం పేర్కొన్నారు. టీబీ ముక్త్ భారత్‌లో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లాలోని హనుమకొండ టీబీ యూనిట్‌లో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రెడ్ క్రాస్ అధ్యక్షులు విజయ్‌చందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, పాపిరెడ్డి, డీసీపీ బారి పాల్గొన్నారు.

నేటి నుంచి బీఫార్మసీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) 7వ సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 21నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 21, 23, 25, 27 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపట్నుంచి డీఈడీ పరీక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ డైట్ కళాశాలలోని డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ)మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 22 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండి అబ్దుల్‌హై తెలిపారు. ఈనెల 22, 23, 24, 25, 27, 28 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. హనుమకొండలోని లష్కర్‌బజార్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

మగ్దూంకు అరుదైన అవకాశం

దుబాయ్‌లోని కళావైభవం కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: నగరానికి చెందిన డాక్టర్ సయ్యద్ మగ్దూంకు అరుదైన అవకాశం లభించింది. చక్కటి వాగ్ధాటితో ఆకట్టుకుంటూ, తెలుగు భాషకు సేవ చేస్తున్న ఆయనకు దుబాయిలో నిర్వహించే శతవసంతాల కళావైభవం కార్యక్రమానికి వ్యాఖ్యానం చేసే అవకాశం దక్కింది. కేంద్ర సాంస్కృతికశాఖ, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ దుబాయి తెలంగాణ సొసైటీ, కలయిక ఫౌండేషన్, విజయకళా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈకార్యక్రమం ఈనెల 25న దుబాయిలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా మగ్దూం మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక కార్యక్రమంలో వ్యాఖ్యానం చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. కాగా..మగ్దూంను నగరంలోని ప్రముఖులు, కళాకారులు అభినందించారు.

సభకు హాజరైన జనం



దండుపాళ్యం ముఠాగా మారారు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై రేవంత్‌రెడ్డి నిప్పులు!

- కేసీఆర్, నరేంద్రమోదీల పాలనపై మండిపాటు
- వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా, రంగాలుగా అభివర్ణన
- విద్యార్థులు, మేధావులు, కార్మిక సంఘాలతో భేటీ
- సమస్యలు అడిగి తెలుసుకున్న రేవంత్
- కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు సాగిన యాత్ర..





అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, స్వాగతం పలికేందుకు వేచి చూస్తున్న మహిళా కార్యకర్తలు

సాక్షిప్రతినిధి, వరంగల్/హన్మకొండ చౌరస్తా: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, సీఎం కేసీఆర్, పీఎం నరేంద్రమోదీల పాలనపై టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను దండుపాళ్యం ముఠాగా అభివర్ణించారు. తెలంగాణలో ప్రజల మనోభావాలు నెరవేరకపోగా.. ఏ వర్గమూ సంతృప్తిగా లేదన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా సోమవారం కాజీపేట దర్గా నుంచి హనుమకొండ చౌరస్తా సమీపంలో ఏనుగులగడ్డ వరకు రేవంత్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఏనుగులగడ్డ, అమృత జంక్షన్ వద్ద డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ తదితరులతో కలిసి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వరంగల్ పశ్చిమ, తూర్పు ఎమ్మెల్యేలు బిల్లా, రంగాలుగా మారి దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేగా దాస్యం ప్రణయ్ భాస్కర్‌కు మంచిపేరుండేదని, ఆయన తమ్ముడిగా ప్రజల ముందుకు వచ్చిన వినయ్ భాస్కర్ అన్నకు సున్నం పెట్టిండని, ఆయన కుటుంబ సభ్యులు ఎక్కడున్నారో తెలియదని మండిపడ్డారు. సభలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు తనదైన శైలిలో పలు వ్యాఖ్యలు చేశారు. వరంగల్ జిల్లా అంటేనే తెలంగాణ ఉద్యమానికి కేంద్రం అని, ప్రొఫెసర్ జయశంకర్ లేనిది ఉద్యమం లేదని, అలాంటి మహానుభావుడి పేరును జిల్లాకు పెట్టారే తప్పితే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ఏం చేశాడని కేసీఆర్‌ను ప్రశ్నించారు..

కాజీపేట దర్గా నుంచి ఏనుగులగడ్డ వరకు..

రేవంత్‌రెడ్డి యాత్ర సోమవారం సాయంత్రం కాజీపేటలో ప్రారంభమైంది. కాజీపేట హజ్రత్ సయ్యద్ షా అఫ్జల్ బియబాని దర్గా నుంచి హనుమకొండ కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని లా కాలేజీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మీదుగా సాగింది. అమరవీరుల స్థూపం (అదాలత్ జంక్షన్) నుంచి కాళోజి విగ్రహం, ఏకశిలా పార్క్, ప్రెస్‌క్లబ్, హనుమకొండ కొత్త బస్టాండ్, శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సర్కిల్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, హనుమకొండ చౌరస్తా మీదుగా ఏనుగుల గడ్డ వరకు సాగింది. ఈ సందర్భంగా తనను కలిసిన విద్యార్థులు, యువకులు, మేధావులు, అడ్వకేట్స్ జేఏసీ, కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులతో మాట్లాడారు. ఆటో రిక్షా కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ములుగు ఎమ్మెల్యే దనసరి సీతక్క, అంజన్‌కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మల్లు రవి, ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్లు పోతుల శ్రీమన్నారాయణ, తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహ్మద్ రియాజ్ పాల్గొన్నారు.

'సీఎం.. సీఎం..' అంటూ నినాదాలు...

భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో ఏనుగులగడ్డ ప్రాంతం కిక్కిరిసిపోయింది. రేవంత్‌రెడ్డి సీఎం.. సీఎం అంటూ యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డప్పు చప్పుళ్లు, బోనాలతో మహిళలు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు. కళాకారుల ఆటపాట కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపాయి.

రోప్ పార్టీ కానిస్టేబుల్‌పై దాడి



వరంగల్ క్రైం: రేవంత్‌రెడ్డి యాత్రలోని రోప్ పార్టీ కానిస్టేబుల్ సాదిక్ పాషాపై కాంగ్రెస్ కార్యకర్త దాడి చేయడం కలకలం రేగింది. హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద రోప్‌ను దాటుకొని లోపలికి చొచ్చుకుపోతున్న కార్యకర్తను కానిస్టేబుల్ నిలువరించడంతో అ కార్యకర్త కానిస్టేబుల్ చాతి భాగంలో బలంగా గుద్దడంతో కుప్పకూలినట్లు తెలిసింది. సహచర కానిస్టేబుళ్లు వెంటనే ఆ కానిస్టేబుల్‌ను చూసి అధికారులకు సమాచారం ఇవ్వడంతో హనుమకొండలోని జయ ఆస్పత్రికి తరలించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని క్యూఆర్‌టీ విభాగంలో పనిచేస్తున్న సాదిక్ పాషాను మెరుగైన చికిత్స కోసం ములుగు రోడ్డులోని అజార హాస్పిటల్‌కు తరలించారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ కానిస్టేబుల్‌ను పరామర్శించారు. కమలాపూర్ మండలం మరిపెల్లిగూడానికి చెందిన శ్రీనివాస్ అలియాస్ లడ్డూ దాడికి పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఆర్ఎస్సై ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

బియాబాని దర్గాలో ప్రార్థనలు

కాజీపేట రూరల్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం కాజీపేట బియాబాని దర్గాను దర్శించుకున్నారు. ఆయనకు దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డి దర్గాపై చాదర్ కప్పి హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు. అనంతరం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం విభజన దిశగా పాలిస్తుంటే, రాహుల్‌గాంధీ ఐక్యపరిచేందుకు జోడో యాత్రను ప్రారంభించారని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని, ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాటిని పెంచకపోవడం శోచనీయమని అన్నారు.



దర్గాలో పూజలు చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

నగరంలో ఉద్రిక్తత

- రేవంత్ యాత్రలో యువనేతపై దాడి
- స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఫ్లెక్సీ ప్రదర్శించిన పవన్
- అంతకు ముందు మహిళలతో కలిసి ప్లకార్డుల ప్రదర్శన
- పవన్‌పై కర్రలతో దాడి.. ముఖం, కంటిభాగంలో తీవ్రగాయాలు



సభా వేదిక వద్ద ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న పవన్



సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దాడి దృశ్యం



కన్ను, ముక్కు, ఒంటిపై గాయాలతో పవన్

వరంగల్ క్రైం: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి హనుమకొండలో చేపట్టిన యాత్ర ముగిసిన కొన్ని క్షణాల్లోనే గుర్తు తెలియని వ్యక్తులు చేసిన దాడిలో యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తోట పవన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి ఏనుగుల గడ్డ వద్ద నిర్వహించిన సభకు ఎదురుగా ఉన్న భవనం పై కాంగ్రెస్ యువ నాయకుడు తోట పవన్ 'దాస్యం దద్దమ్మ' అనే ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేకలు పెట్టారు. రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత ఎక్కడి వారు అక్కడికి వెళ్తున్న క్రమంలో దాడి జరిగినట్లు తెలిసింది. ఎశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌కు వ్యతిరేకంగా డబుల్ బెడ్రూంలను అర్హులకు అందించాలని డిమాండ్ చేస్తూ.. స్థానిక మహిళలతో కలిసి బాలసముద్రంలోని అంబేడ్కర్ కాలనీ వద్ద ప్లకార్డులతో పవన్ నిరసన వ్యక్తం చేశారు.

ఆది నుంచి వ్యతిరేకం..

ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా మొదటి నుంచి తోట పవన్ బహిరంగంగా విమర్శలు చేస్తూ వస్తున్నారు. గతంలో సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో పవన్‌పై పెట్టిన కేసులను కోర్టులో చాలెంజ్ చేసి పోలీసులకు వ్యతిరేకంగా తీర్పు తెచ్చుకున్నారు. నాయిని రాజేందర్‌రెడ్డి వర్గీయుడిగా ముద్ర పడ్డ పవన్‌కు కాంగ్రెస్‌లో మరో వర్గంతోనూ విబేధాలున్నట్లు తెలిసింది.

ముఖంపై బలమైన గాయాలు

తోట పవన్‌పై కర్రలతో దాడి చేసినట్లు వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. అతడి ముక్కు ఎముకలు, ముఖ ఎముకలు విరగడంతో పాటు కుడి కన్నుకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రి వద్ద తోట పవన్ తల్లి ఏఎస్సై భారతితో పాటు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పవన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆస్పత్రికి తరలివచ్చారు. దీంతో హనుమకొండలోని మాక్స్‌కేర్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆస్పత్రి వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు.

ఎమ్మెల్యేది రౌడీయిజం

కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ రౌడీయిజం, గుండాయిజం, కబ్జాయిజానికి పాల్పడుతున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ యువజన ఉపాధ్యక్షుడు పవన్‌పై దాడికి పాల్పడింది రంజిత్‌రెడ్డి, రాజ్‌కుమార్, ఆది, టీఆర్‌ఎస్వీకి చెందిన మరో నేత అని ఆరోపించారు. రంజిత్‌రెడ్డి గంజాయి, డ్రగ్స్‌ను యువతకు అలవాటు చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు.

దాడులు అప్రజాస్వామికం

ప్రశ్నించిన వ్యక్తులపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యం కాదని బీజేపీ నేత రాకేశ్‌రెడ్డి ఆరోపించారు. 'దాస్యం దద్దమ్మ' అంటే అంత కోపం ఎందుకని మంచి పనుల ద్వారా సమాధానం చెప్పాలని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు?

పవన్‌పై దాడికి పాల్పడిన బీఆర్‌ఎస్ నాయకులను సుబేదారి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా, పవన్‌పై దాడి జరిగిన స్థలంలో సీసీ కెమెరాల్లో దాడి దృశ్యాలు నమోదైనట్లు తెలిసింది. పవన్‌ను ఆస్పత్రికి తరలించిన కొద్ది క్షణాల్లోనే సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్క్ మాయమైనట్లు ప్రచారం జరిగింది. హార్డ్ డిస్క్‌ను బీఆర్‌ఎస్ నాయకులు తీసుకెళ్లారా? లేక పోలీసులు తీసుకెళ్లారా? అనే విషయంపై ఆస్పత్రి వద్ద చర్చ జరిగింది.



పవన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయిని రాజేందర్‌రెడ్డి

వినతుల వెల్లువ

- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు 65 అర్జీలు
- వినతులు స్వీకరించిన కమిషనర్ ప్రావీణ్య



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు వినతులు వెల్లువలా అందాయి. వివిధ కాలనీల ప్రజలు సమస్యలకు పరిష్కారం చూపాలని ఏకరువు పెట్టారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్స్‌సెల్‌లో కమిషనర్ ప్రావీణ్య వింగ్ అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సమక్షంలో వినతులు స్వీకరించి, పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. మొత్తం 65 ఫిర్యాదులు రాగా.. అందులో ఇంజనీరింగ్ విభాగానికి 14, టౌన్ ప్లానింగ్ సెక్షన్‌కు 33, పన్నుల విభాగానికి 8, ప్రజారోగ్య-శానిటేషన్ విభాగానికి 7, నీటి సరఫరా సమస్యలపై 3 చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, శ్రీనివాస్‌రెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఖమ్మం, కరీంనగర్ కార్పొరేషన్లలో ఔట్ సోర్సింగ్ జవాన్లకు ఒక్కొక్కరికి రూ.19,500 వేతనం అందజేస్తున్నారని, 10గంటలకు హాజరు రద్దు చేయాలని, ఇన్సూరెన్స్ బాండ్లు ఇప్పించాలని కోరుతూ సీఐటీయూ, టీఎమ్మార్పీఎస్, టీఎంఈడబ్ల్యూఏ, జేఏసీ నాయకులు విన్నవించారు.
- హనుమకొండ 5వ డివిజన్ కొత్తూరులో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నివాసాల కంటే కిందికి ఉన్నాయని, మురుగునీరు రోడ్లపై పారుతుందని కొత్తగా నిర్మించాలని కాలనీవాసులు వినతిపత్రం అందించారు.
- వరంగల్ 38వ డివిజన్ ఎస్సీ వాడలో మురికి కాల్వలు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారాయని, పూడ్చాలని, లేకపోతే కొత్తగా నిర్మించాలని కాలనీవాసులు కోరారు.
- ఖిలా వరంగల్ ఈద్గాలో వీధి లైట్లు, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఖలీద్ తస్వీర్ విజ్ఞప్తి చేశారు.
- 17వ డివిజన్ ధర్మారం 36-2-86 సీసీ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- 42వ డివిజన్ మామునూరు ఇంటి నంబరు 1-104/3, రెడ్డి కాలనీ 3-9-487/1కి నల్లా కనెక్షన్ లేకుండా బిల్లు వస్తోందని, మినహాయించాలని వేర్వేరుగా దరఖాస్తులు అందజేశారు.
- చింతగట్టులోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలువాడలకు చెందిన స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- 4వ డివిజన్ మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని పలు నివాసాల యజమానులు కోరారు.
- హనుమకొండ కంచరకుంట రాజరాజేశ్వర స్వామి దేవాలయ భూముల్లో నిర్మాణాలను రద్దు చేసి, భూమిని కాపాడాలని చీకటి రాజు వినతిపత్రం అందజేశారు.
- వరంగల్ 14, 20 డివిజన్ల పరిధి చిన్నవడ్డేపల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో సీఎం ప్రత్యేక నిధులు రూ.1.30 కోట్లతో పనులు చేసినట్లు రికార్డులు తయారు చేసి బిల్లులు స్వాహా చేశారని, చర్యలు తీసుకోవాలని భూముల పరిరక్షణ సొసైటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్ వినతిపత్రం అందజేశారు.

మెట్టుగుట్టపై వైభవంగా స్వామివారికి త్రిశూల స్నానం



స్వామివారికి త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

మడికొండ: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం గవ్యాంత పూజలు, నిత్యోపాసన, నవగ్రహ, రుద్రసహిత చండీ హోమం, నిత్యబలిహరణ, వసంతోత్సవం, త్రిశూల స్నానం నిర్వహించిన అనంతరం స్వామివారికి అన్నపూజ, నీరాజన మంత్ర పుష్పాలు, యజ్ఞప్రసాదం నిర్వహించారు. సాయంత్రం పవలింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంతసేవ, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థప్రసాదాల వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కే.శేషుభారతి, అర్చకులు అఖిలాశ్‌శర్మ, విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణశర్మ, చైర్మన్ దువ్వ నవీన్, ధర్మకర్తలు సీహెచ్.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పరిష్కరించాలి

ప్రజావాణిలో వరంగల్ కలెక్టర్ డాక్టర్ బి.గోపి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి, అదనపు కలెక్టర్ అశ్విని వాకడే

వరంగల్ రూరల్: భూ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి.. నిబంధనల మేరకు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించగా.. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 54 అభ్యర్థనలు రాగా.. వీటిలో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు 28 వరకు ఉన్నాయన్నారు. ఆయా శాఖల అధికారులు వాటిని పరిశీలించి.. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కాగా.. వరంగల్ దేశాయిపేటలోని సర్వే నం.306లో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని దేశాయిపేటకు చెందిన గిన్నారపు దయాకర్ వినతిపత్రం అందించాడు. వర్ధన్నపేట కోనారెడ్డి చెరువు కట్ట పనులు నాసిరకంగా చేపడుతున్నారని దీనిపై విచారణ చేపట్టి పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని మాదిగ రాజకీయ పోరాట సమితి, జేఏసీ జిల్లా కన్వీనర్ ఈరెల్లి శ్రీనివాస్ విన్నవించారు. తనకు రావాల్సిన నాలుగు నెలల 15 రోజుల డబ్బులు రూ.90 వేలు ఇవ్వకుండానే తనను విధుల్లో తొలగించారని, తనకు డబ్బులిప్పించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేసిన శాయంపేటకు చెందిన కిరణ్ కలెక్టర్‌కు విన్నవించారు. విచారణ జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కరపత్రం ఆవిష్కరించిన కలెక్టర్

సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాల కరపత్రాన్ని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ డాక్టర్ బి.గోపి సోమవారం ఆవిష్కరించారు. వరంగల్ యాకబ్‌పురలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో ఈనెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహించే జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఉత్సవ కమిటీ కోరింది.

వేయి స్తంభాల దేవాలయంలో అన్నపూజ

హన్మకొండ కల్చరల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేయిస్తంభాల దేవాలయంలో నాలుగోరోజు సోమవారం అమావాస్య తిథిని పురస్కరించుకుని రుద్రేశ్వరస్వామి వారిని సోమావతి అమావాస్య రుద్రుడిగా అలంకరించి ఘనంగా అన్నపూజ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు మణికంఠ శర్మ, అర్చకులు సందీప్‌శర్మ, ప్రణవ్ ఉదయం 5గంటల నుంచి సుప్రభాతసేవ, ఉత్తిష్ట గణపతికి ఆరాధన, శ్రీరుద్రేశ్వరుడికి ఆఘోర పాశుపత రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం 51 కిలోల పెరుగన్నంతో వేదోక్తంగా అన్న సూక్త మంత్ర పఠనంతో శ్రీరుద్రేశ్వరస్వామి వారి మహా శివలింగాన్ని సోమావతి అమావాస్య రుద్రుడిగా అలంకరించి షోడశోపచార పూజలు నిర్వహించారు.

నేడు చందనోత్సవం, పూర్ణాహుతి...

మంగళవారం ఉదయం శ్రీఆంజనేయస్వామికి చందనోత్సవం, ఆకుపూజ, శ్రీరుద్రేశ్వరస్వామి ప్రత్యేక పూజలు, మహా పూర్ణాహుతి, ఉత్సవ పరిసమాప్తి అవుతాయని గంగు ఉపేంద్రశర్మ తెలిపారు.



సోమావతి అమావాస్య రుద్రుడిగా రుద్రేశ్వరస్వామి

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఓ మహిళ, నిర్వాహకురాలు, విటుడి అరెస్ట్

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ఏరియాలో వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు,కె. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ వాగ్దేవి కళాశాల సమీపంలోని నయింనగర్ కాలనీకి చెందిన అడ్లూరి సంధ్య అలియాస్ సుజాత కొంత కాలంగా వ్యభిచార గృహాన్ని నడిపిస్తూ పేదరికం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలను చేరదీసి వారిని వ్యభిచార రొంపిలోకి దించుతోంది. వారి వద్దకు వీటులను పంపి సొమ్ము చేసుకుంటుంది. ఈక్రమంలో శంభునిపేట ప్రాంతానికి చెందిన ఓ మహిళ పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న సుజాత తన వద్దకు వచ్చే విటులను ఆ మహిళ వద్దకు పంపి వద్దకు పంపిస్తుంది. వరంగల్ శంభునిపేట ఏరియాలో ఓ ఇంట్లో రహస్యంగా వ్యభిచారం సాగుతుందని టాస్క్‌ఫోర్స్ అధికారులకు పక్కా సమాచారం అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం రాత్రి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈదాడులో మహిళతోపాటు నిర్వాహకురాలు అడ్లూరి సంధ్య, అలియాస్ సుజాత, మరో మహిళతోపాటు విటుడిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, 2 కండమ్స్, రూ.550 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకురాలితోపాటు మరో వ్యక్తిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్ తెలిపారు.

Form No.3 [See Regulations-15(1)(a)]/16(3)
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT-I)
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500001

Case No. OA 239 of 2021

Summons under sub section (4) of section 19 of the Act, read with sub rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

CANARA Bank, Kazipet Branch. ...Applicant Bank

Vs

B. Raja Mouli, S/o. Late. Shankaraiah & 3 Others. ...Defendant

Between

CANARA Bank, Kazipet Branch, Warangal, Rep. by. Authorized Officer, Satyam Babu, S/o Damera Mohan, aged 51 years, Occ: Manager, R/o. Warangal Dist. ...Applicant Bank

And

2. Kusum Ramesh, S/o. Rajamouli, Aged about 44 years, Occ: Agriculture, H.No. 1-137, Gangadevipally, Warangal.
3. Y.Nagesh Kumar, S/o. Y.Nagabhushanam, Aged about 53 years, Occ: Agriculture, H.No. 8-11-143, Kondurivari Street, Warangal. ...Defendant No..2 & 3

SUMMONS

Whereas, OA.No.239/2021 was Listed before Hon'ble Registrar/PO on 03/02/2023 (Date of Filling/Last date of Hearing).

Whereas this Hon'ble Tribunal is pleased to issue Summons/Notice on the said application Under Section 19(4) of the Act,(OA) filed against you for Recovery of debts of Rs.1,07,61,640.01 Paisa (Application along with copies of documents etc., Annexed).

In accordance with sub section (4) of section 19 of the Act, you, the defendants are directed as under.

(i) To show cause within Thirty days of the Service of Summons as to why relief prayed for should not be granted.
(ii) to disclose particulars of Properties or assets other than properties and assets specified by the applicant under serial Number 3A of the Original Application.
(iii) You are Restrained from dealing with or disposing of Secured Assets or such other Assets and properties disclosed under serial Number 3A of the Original Application, pending hearing and disposal of the Application for attachment of properties.
(iv) You shall not transfer by way of Sale, Lease or otherwise, except in the Ordinary Course of his business any of the assets over which Security interest is created and / or other Assets and Properties specified or disclosed under serial Number 3A of the Original Application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the Sale Proceeds realized by Sale of Secured Assets or other assets and Properties in the ordinary course of business and deposit such Sale proceeds in the Account maintained with the bank or financial institutions holding Security interest over such Assets.

You are also directed to file the Written Statement with a Copy thereof furnished to the Applicant and to Appear before PO/Registrar on 24/02/2023 at 10.30 AM failing which the application shall be heard and decided on your Absence.

Given under my hand and the Seal of this Tribunal on this date 03/02/2023.

Sd/- Registrar/PO,
Debts Recovery Tribunal, Hyderabad.

తేనెలొలుకు.. తెలుగు భాష

మాతృభాషకు గౌరవం పెంచుదాం..

- వక్తిత్వవికాసానికి తెలుగు తప్పనిసరి
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



జనగామ : అమ్మఒడి మాతృభాష గొప్పదనాన్ని అందిస్తుంది. చిన్న తనంలోని కమ్మనైన జోల పాటలు... నీతి పద్యాలు పిల్లల ఎదుగుదలలో పౌరులుగా తయారు చేస్తుంది. కానీ ఎక్కడ చూసినా యాంత్రిక విద్యకు ఇచ్చిన ప్రాధాన్యతను.. విలువలు నేర్పే మాతృభాష(తెలుగు)కు ఇవ్వడం లేదు. మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచంతో పోటీ పడుతున్నామని మురిసిపోవడమే తప్పు... జీవిత పాఠాలు, క్రమశిక్షణ నేర్పించే మన మాతృభాష తెలుగును మరచిపోతున్నాం. దీంతో ఎన్నో రకాల దుష్ఫలితాలను సమాజం అనుభవిస్తున్నది. విలువైన విద్యను కాపాడగలిగే ప్రయత్నం చేస్తూ, మానవతా సిరులను మాతృభాష ద్వారా పెంపొందించగలగాలి. విద్య వ్యక్తిత్వాన్ని నేర్పించి, పది మందికి ఉపయోగపడే వ్యక్తిగా తీర్చిదిద్దగలగాలి. నేటి ఆధునిక ప్రపంచంలో తనకు తాను గొప్పగా బతికితే చాలు, పది మంది జీవితం మాకెందుకు అనే ధోరణిలో చాలామంది ఉంటున్నారు.

మాతృభాష ఆదరణ తగ్గిందా...!

శ్రీకృష్ణదేవరాయల కాలంలో వెలుగు వెలిగిన తెలుగు భాషకి నేడు కొంత ఆదరణ తగ్గిందనే అనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం ఉన్నతమైన ఉద్యోగం సంపాదించాలంటే ఆంగ్లమే ప్రధానమనే భావన పాతుకుపోయింది. ఆంగ్లం అవసరం ఉన్నప్పటికీ, అదొక్కటే చాలదు. విషయ పరిజ్ఞానం అవసరం. మాతృభాష ద్వారానే అన్న సంగతి నేటితరం యువతీ, యువకులు అర్థం చేసుకోలేకపోతున్నారు. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఆంగ్లం అనర్గళంగా మాట్లాడే వ్యక్తులు వేలాదిగా కనిపిస్తారు. కానీ ఇందులో చాలా మందికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు రావడం లేదు. ఎందుకంటే విజ్ఞాన సముపార్జన కలిగిన వారు మాత్రమే ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారు. వ్యక్తిత్వ వికాసానికి మాతృభాష బోధన ఉపకారం ఎంతో ప్రాధాన్యమైంది.

మాతృభాషను కాపాడుకునేందుకు సూచనలు

- పాఠశాలల్లో మాతృభాషకు ప్రాధాన్యత పెంచాలి.
- అమ్మ ఒడి నుంచి ఇంగ్లీష్ రైమ్స్‌తో పాటుగా, అంతకంటే ఎక్కువగా విలువైన తెలుగు బాలగేయాలను ప్రతి మాతృమూర్తి నేర్పగలగాలి.
- ప్రతి తెలుగు పౌరుడు, పౌరురాలు మాతృభాషను తమ శ్వాసగా చేసుకోగలగాలి.
- దుకాణాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మొదలైనవి తెలుగులోనే రాయాలి.
- తెలుగు భాషపై ఆసక్తిని పెంచే ఉపాధ్యాయుల ప్రయత్నానికి సహకరించాలి.

మాతృభాష గొప్పదనం తెలుసుకోవాలి



పిల్లల మానసిక వికాసానికి దోహదపడే మాతృభాషలోని నీతి కథలు, సూక్తులు, మంచి విషయాలు పిల్లలకు నేర్పించడం లేదు. ఆంగ్లంపై పెరుగుతున్న మోజుతో తల్లిదండ్రులతో పాటు విద్యాలయాల్లో సైతం మాతృభాషను కొద్దో గొప్పో మాట్లాడడం తప్ప... మెజార్టీ పిల్లలు తెలుగులో అమ్మా అని రాయలేకపోతున్నారు.

- త్రిపురారి పద్మ, తెలుగు పండిట్, రచయిత్రి, జనగామ

మాతృభాష మనిషికి ప్రాణవాయువు



ఆధునిక మానవ వికాసం ఊహలకు అందకుండా దూసుకుపోతోంది. నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. మానవీయ బంధాలు క్రమంగా శిథిలమవుతున్నాయి. సెల్‌ఫోన్ పుణ్యమా అని తమ సమయాన్ని సోషల్ మీడియాకే కేటాయిస్తున్నారు. భాషా ప్రయోగంలో దేశీయత ఉట్టిపడేలా వర్తమాన రచయితలు తమ రచనల్లో కవితాభివృద్ధి కళా సుందరంగా ఉండేటట్లు ప్రయత్నించాలి.

- పానుగంటి రామమూర్తి అధ్యక్షుడు, తెలంగాణ రచయితల సంఘం

జీవన విధానానికి మూలాధారం..



మన సంస్కృతీ, సంప్రదాయాలు, జీవన విధానానికి మూలాధారం మాతృభాష అవసరం. మనిసి తన జీవితంలో ప్రయత్నంగా తల్లి ఒడి నుంచి నేర్చుకోవాలి, అమ్మ భాషను అమ్మను కాపాడుకున్నట్టే. ఇతర బాషలను నేర్చుకుంటూనే... తెలుగు భాషను గౌరవిద్దాం. భాషా పరిరక్షణకు ప్రాథమిక విద్య నుంచే విద్యాబోధన మరింత పటిష్టం కావాలి.

- వసంత, ఉపాధ్యాయురాలు, రచయిత్రి, జనగామ

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మహబూబాబాద్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీసీపీ బారి, తదితరులు

- వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి
- జేఎన్ఎస్‌లో ముగిసిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్

వరంగల్ స్పోర్ట్స్: క్రీడల్లో రాణిస్తే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండడమే కాకుండా ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి యువతను ఉద్దేశించి అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండ్రోజుల పాటు జరిగిన వరంగల్ సిటీ బాస్కెట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ బారి హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్న క్రీడల్లో సాధన చేస్తే ఉన్నత స్థానాలను చేరుకునేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. తాను కూడా క్రీడాకారుడిగా క్రీడా కోటలోనే పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానని తెలిపారు. వ్యసనాలకు లోబడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. సీనియర్ మెన్ కేటగిరీలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 10 జట్లు హాజరు కాగా.. విజేతగా మహబూబాబాద్ జట్టు, రన్నరప్‌గా వరంగల్ ఎల్‌బీ కాలేజీ జట్టు నిలిచింది. కాగా.. మూడో స్థానంలో జేఎన్ఎస్, కేసముద్రం జట్లు జాయింట్ విన్నర్స్‌గా నిలిచాయి. కార్యక్రమంలో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారథి, వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాద్ ఎస్ఐ క్రాంతికిరణ్, డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ ప్రశాంత్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే భారీ చోరీ...

- 9 తులాల బంగారం, 20 తులాల వెండి, నగదు అపహరణ



చోరీకి గురైన ఇంట్లో విచారణ చేపడుతున్న ఏసీపీ, సీఐ

జనగామ: జనగామలో దొంగలు పట్టపగేలే చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. సీఐ ఎలబోయిన శ్రీనివాస్, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వాసవీకాలనీ ఫేస్-2లో నివాసముంటున్న శివగారి కిరణ్, రజని ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. రోజులాగే ఉదయం భార్యాభర్తలు స్కూల్‌కు వెళ్లాపోయారు. అదే ఇంట్లో పైఅంతస్తులో అద్దెకు ఉంటున్న ఉద్యోగి సైతం లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు..తలుపుకు వేసిన తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం 5 ఇంటికి వచ్చిన దంపతులు తలుపులు తీసి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్రల నిపుణలు పిలిపించి విచారణ చేపట్టారు. 9 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి, రూ.40వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుల వాంగ్మూలం మేరకు ఫిర్యాదు స్వీకరించి విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

త్రైమాసిక పన్నులు వెంటనే చెల్లించాలి

- స్వచ్ఛందంగా చెల్లిస్తేనే పెనాల్టీలో రాయితీ
- ఎంవీఐ వెంకన్న



జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ వెంకన్న

ఖిలావరంగల్: ట్రాన్స్‌పోర్ట్ వాహనాలకు చెల్లించాల్సిన త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలని లేకుంటే 200 శాతం ఫెనాల్టీలు తప్పదని వరంగల్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వెంకన్న హెచ్చరించారు. వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్ పురుషోత్తం ఆదేశాలు, వరంగల్ ఆర్టీఓ అఫ్రీన్ సిద్ధిఖీ సూచనల మేరకు సోమవారం వరంగల్ రవాణాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జాతీయ రహదారులపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. రహదారులపై ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ట్యాక్సీలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి ఆర్టీఏ కార్యాలయానికి తరలించారు. అనంతరం ఎంవీఐ వెంకన్న మాట్లాడుతూ ట్రాన్స్‌ఫోర్ట్ వాహనాలకు త్రైమాసిక ట్యాక్స్ చెల్లించకుండా యధేచ్ఛగా తిరుగుతున్న వాహనాలపై కొరడా ఝుళిపించామని తెలిపారు. వాహన దారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్యాక్సీలు చెల్లిస్తే ఫైనాల్టీలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నామని తెలిపారు.స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడితే 200 శాతం ఆదనంగా పెనాల్టీ కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

భూపాలపల్లి రూరల్: వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని గోర్లవీడులో చోటు చేసుకొంది. గ్రామస్తులు వ్యవసాయ కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షాజహాన్‌బీ (40) రోజువారీగా కూలీలతో కలిసి పత్తి ఏరడానికి వెళ్లింది, ఈ క్రమంలో పాము కరవడంతో తోటి కూలీలు చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించినట్లు తెలిపారు. మృతురాలకు భర్త లాల్‌పాషా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి..

ధర్మసాగర్: మండలంలోని ముప్పారం శివారులో గ్రానైట్ క్వారీలో కంప్రెషర్ ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన ఆలకుంట్ల ఇద్దయ్య కొద్ది రోజుల క్రితం గ్రానైట్ క్వారీలో పని చేయడానికి వచ్చాడు. సోమవారం ఉదయం ఇద్దయ్య కాంప్రెషర్ ట్రాక్టర్‌తో గుట్టపైకి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో ఆయన ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన పోలీసులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పామునూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో మా వోయిస్టులు అమర్చిన మందుపాతరను పోలీ సులు నిర్వీర్యం చేశారు. సోమవారం ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ కథనం ప్రకారం.. గ్రామసమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీ సులను హతమార్చేందుకు మావోయిస్టులు ఈ నెల 17న మందుపాతర అమర్చినట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు వెంకటాపురం సీఐ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై తిరుపతిరావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, స్పెషల్ పార్టీ, బాంబ్ డిస్పోజల్ టీమ్‌తో కలిసి పామునూరు సమీపంలోని అట వీ ప్రాంతానికి వెళ్లినట్లు తెలిపారు. అటవీప్రాంతంలో బాంబ్‌ను గుర్తించేందుకు కూంబింగ్ చేస్తుండగా రోడ్డుపై విద్యుత్ తీగలు కనిపించాయి. దాన్ని పరిశీలించుకుంటూ వెళ్లారు. అది పామూనూరు సమీపంలోని అటవీప్రాంతంలోకి వెళ్లిందని తెలిపారు. అటవీప్రాంతంలో బీర్ బాటిల్‌బాంబ్‌ను గుర్తించినట్లు తెలి పారు. తక్షణమే బాంబ్ డిస్పోజల్ బృందాలు బాంబ్‌ను నిర్వీర్యం చేసినట్లు పేర్కొన్నారు. బాంబ్‌ను అమర్చిన మావోయిస్టు అగ్రనేతలపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

23న జాబ్‌మేళా

కాళోజీ సెంటర్: ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు జిల్లాలోని నిరుద్యోగ యువకులకు ఈనెల 23న ములుగు రోడ్డులోని ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సుస్థిర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఎల్ఎల్‌పీ కంపెనీల్లో మార్కెటింగ్ మేనేజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌గా హైదరాబాద్‌లో పని చేయడానికి దాదాపు 40 ఉద్యోగాలకు ఎంపికలు ఉంటాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 11 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు. పూర్తి సమాచారానికి 77993 14685, 93903 93669 నంబర్లకు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరించాలి

- ఏనుమాములలో కొత్త లైసెన్స్‌లు, మడిగెలను నిర్మించాలి
- మౌలిక వసతులు కల్పించాలి
- మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు



మార్కెటింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ప్రతినిధులు

వరంగల్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, కొత్త అడ్తి లైసెన్సుల జారీ, అపరాల షట్టర్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయిని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, అడ్తి కమీషన్, ఏజెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం పెంటయ్య, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎస్‌రెడ్డి లింగారెడ్డి కోరారు. సోమవారం హైదరాబాద్‌లో మార్కెటింగ్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌లోని ప్రాథమిక చికిత్స కేంద్రం విస్తరించి, టాయిలెట్స్‌ను నిర్మించాలని, అదే విధంగా ఛాంబర్‌కు గతంలో కేటాయించిన 35 గుంటల స్థలంపై ఉన్న లీజు తీసివేయాలని కోరారు. 194 క్యూ సెక్షన్‌తో అడ్తిదారుల నుంచి వసూలు చేస్తున్న టీడీఎస్ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. బార్దాన్ చెల్లింపుల కోసం ఖమ్మం వ్యవసాయం మార్కెట్‌లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి వచ్చిన తర్వాత సమస్య పరిష్కారానికై సమీక్షా సమావేశం ఏర్పాటు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఇంటిగ్రేటెడ్ వేయింగ్ మిషన్లు పనిచేయడం లేదని, తగినన్ని అందుబాటులో లేకపోవడంతో రైతు సరుకుల తూకంలో జాప్యం జరుగుతోందన్నారు. తాము తెలిపిన అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించి ఒక నెల రోజుల్లో పైన వివరించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తానని మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

లోన్ ఇస్తామని సైబర్ మోసం

- రూ. 1.15 లక్షలు కాజేత



స్టేషన్‌ఘన్‌పూర్: లోన్లు ఇస్తామని నమ్మబలికి మండలంలోని మీదికొండకు చెందిన మ్యాదారపు కేదారి బ్యాంకు అకౌంట్ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1,15,224 కాజేసిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. సీఐ రాఘవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మీదికొండకు చెందిన చిదురాల పద్మకు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. ప్రభుత్వం ద్వారా మీకు లోన్ వస్తుందని, మీ బ్యాంకు అకౌంట్ నంబర్, గుగూల్ పే, ఫోన్ పే నంబర్ ఇవ్వాలని అడిగాడు. ఇందుకు ఆమె తనకు బ్యాంకు ఖాతా లేదని, ఇంటి సమీపాన ఉండే మ్యాదారపు కేదారికి ఉందని, అతడికి ఫోన్ కలిపింది. దీంతో సైబర్ నేరగాడు ఫోన్‌కు ఒక లింకు పంపిస్తామని, దాన్ని క్లిక్ చేస్తే మీకు డబ్బులు అకౌంట్‌లో పడుతాయని నమ్మబలికాడు. దాంతో కేదారి తన ఫోన్‌కు, గుగూల్ పేకి వచ్చిన లింక్‌ను క్లిక్ చేయగా పలుమార్లు అతడి ఖాతా నుంచి మొత్తం రూ.1,15,224 కాజేసినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు పంపే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయాలన్నారు.

ఉద్యోగం రాలేదని ఉరేసుకున్నాడు

- పోలీస్ ఈవెంట్స్‌లో ఎంపికవ్వని యువకుడు
- మనస్తాపం చెంది ఆత్మహత్య

ఖిలా వరంగల్: ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కన్నాడు. అందుకోసం కొన్నాళ్లుగా నగరంలో శిక్షణ పొందుతున్నాడు. స్నేహితులతో కలిసి అద్దె గదిలో ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. కాగా.. ఇటీవల నిర్వహించిన పోలీస్ ఈవెంట్స్‌లో ఆ యువకుడు ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో ఇక తనకే ఉద్యోగమూ రాదని మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఉద్యోగం రాదనే బెంగతో సోమవారం రాత్రి వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్‌తోటలో రూమ్ ఆద్దెకు తీసుకుని ఉంటున్న కుతాటి రాజేశ్(22) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేశ్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే అనారోగ్యంతో మృతి చెందారు. అతడి మేనమామ సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన రాయపురం సాంబశివ పెంచి పెద్ద చేసి చదివించాడు. కొంత కాలంగా వరంగల్ కరీమాబాద్ ఏరియాలోని ఎస్ఆర్ఆర్‌తోటలో రాజేశ్ మరో స్నేహితుడితో కలిసి అద్దె గదిలో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాడు. ఇటీవల జరిగిన పోలీస్ ఈవెంట్స్‌కు వెళ్లిన రాజేశ్ ఉత్తీర్ణత సాధించలేదు. తనకే ఉద్యోగమూ వచ్చేలా లేదని సోమవారం రాత్రి రూమ్‌లోనే ఉరేసుకున్నాడు. అతడి స్నేహితుడు సాంబమూర్తి రాత్రి ఉద్యోగానికి వెళ్లి ఇంటికి వచ్చే సరికే గది తలుపులు మూసి ఉన్నాయి. ఎంత పిలిచినా రాజేశ్ నుంచి స్పందన రాకపోవడంతో కిటికిలో నుంచి చూడగా.. రాజేశ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. సాంబమూర్తి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. రాజేశ్ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి మేనమామ రాయపురం సాంబశివ ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పండుగకు వచ్చి.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి



శివ(ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

సంగెం: మహాశివరాత్రి సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి తిరిగి హాస్టల్‌కు వెళ్తూ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పర్వతగిరి మండలం మాల్యాతండా శివారు పంచరాయి తండాకు చెందిన బానోత్ వెంకన్న-భారతి దంపతులకు ఇద్దరు కూతుళ్లు నాగేశ్వరీ, రాజేశ్వరీ, కుమారుడు శివ ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వెంకన్న కుమారుడు శివను పున్నేలు శివారు ఏకశిల పాఠశాలలో 4వ తరగతి చదివిస్తున్నాడు. మహాశివరాత్రికి సెలవు రావడంతో కుమారుడిని ఇంటికి తీసుకుని వచ్చారు. తిరిగి హాస్టల్‌లో దింపి రావడానికి తండ్రి వెంకన్న తన ద్విచక్ర వాహనంపై శివ (12)ను వెనుక కూర్చుండబెట్టి వెళ్తున్న క్రమంలో సంగెం మండలం గవిచర్ల దాటగానే ఓ కోళ్ల ఫారం సమీపంలో తూర్పుకోటకు చెందిన గోక వినయ్‌కుమార్ టాటాఏస్ గూడ్స్ వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో వెనకాల కూర్చున్న శివ ఎగిరి రోడ్డుపై పడడంతో అతని తలపై నుంచి టాటాఏస్ వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.

మిన్నంటిన రోదనలు

ఇద్దరు కూతుళ్లు జన్మించగా వారసుని కోసం ఎదురు చూస్తే మూడో సంతానంగా పుట్టిన కుమారుడికి శివ అని ముద్దుగా పిలుచుకుంటున్నారు. ఉన్నత చదువులు చదివి కుటుంబాన్ని ఉద్ధరిస్తాడనుకుంటే అర్ధంతరంగా కానరాని లోకాలకు వెళ్లాడని, మంచిగా చదువుకుంటానని చెప్పి టాటా చెప్పి వెళ్లిన కాసేపటికే తిరిగిరాని లోకాలకు వెళ్లావా బిడ్డా అని తల్లితండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. మృతుడి తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

ఏమిటి సారూ..ఈ గ్రీవెన్స్ 'సెల్' తీరు!



బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో దరఖాస్తులను స్వీకరించే వేదికపై కమిషనర్ ప్రావీణ్య పక్కన ఆశీనులై నిద్రపోతున్న సీపీ,వాట్సప్ చాటింగ్ చేస్తున్న ఎంహెచ్‌ఓ

ఈ ఫొటో చూడండి. నిద్రలో ఒకరు. వాట్సప్ చాటింగ్‌లో ఇంకొకరు. ఫోన్ నిశితంగా చూస్తూ మనొకరు, పెండింగ్ ఫైళ్లు పరిశీలిస్తూ మరో అధికారి.. ఇదంతా ఎక్కడో కాదు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్ గ్రీవెన్స్ సెల్‌లోని చిత్రమిది. సాక్షాత్తూ ఐఏఎస్ అధికారి, కమిషనర్ ప్రావీణ్య స్వయంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న క్రమంలో కనిపించిన దృశ్యం. ఎంతో ముఖ్యమైన ఈ కార్యక్రమంలో అప్రమత్తంగా ఉండాల్సిన బల్దియా వింగ్ అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- వరంగల్ అర్బన్